క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాజేడు : మండల పరిధిలోని చీకుపల్లి గ్రామం వద్ద ఎస్సై జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. శనివారం సాయంత్రం జాతీయ రహదారి పై వచ్చి, వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి, కొత్త వారి వివరాలను సేకరించారు.

జీపీకి స్థలం అప్పగింత



వాజేడు : మండల పరిధిలోని పేరూరు గ్రామ పంచాయతీకి రెవెన్యూ అధికారులు శనివారం స్థలాన్ని అప్పగించారు. గ్రామంలోని 51, 41 సర్వే నంబర్ల పరిధిలోని ప్రభుత్వ భూమిని ఆర్ఐ కుమారస్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్, జీపీఓ మున్వర్ హుస్సేన్, గ్రామస్తుల సమక్షంలో సర్వేయర్ కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణాలకు స్థలాన్ని అప్పగించారు. అనంతరం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



మంగపేట : మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీనుంచి అక్టోబర్ 2వ తేదీవరకు జరిగే ఉమాదేవి శరన్నవరాత్రి (దసరా)వేడుకల కరపత్రాన్ని ఆలయ చైర్మన్ కోలగట్ల నరేష్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యంత వైభవంగా నిర్వహించే శరన్నవరాత్రి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలన్నారు. పూజారి నరేష్‌శర్మ, కమిటీ సభ్యులు సురేష్, మల్లయ్య, కేశవరావు పాల్గొన్నారు.

బైక్ ఢీ.. తెగిపడిన కాలు



ఏటూరునాగారం : మండలంలోని 163 జాతీయ రహదారి రొయ్యూర్ సమీపంలో మిర్చి తోటకు నీరుపెట్టి రోడ్డు మీదకు వస్తున్న రాందాస్ సర్వేశంను ముళ్లకట్టకు చెందిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో సర్వేశం మోకాలి నుంచి కాలు తెగిపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. మండల కేంద్రానికి చెందిన సర్వేశం రొయ్యూర్ సమీపంలో మిర్చిపంట సాగు చేస్తున్నాడు. ఇదే క్రమంలో తోటలో నీరుపెట్టి రోడ్డు మీదకు వస్తుండగా బైక్‌ఢీకొనడంతో ఈ సంఘటన జరిగింది. హుటాహుటిన 108లో సామాజిక ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



చిట్యాల: విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదువుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యార్థుల అభ్యున్నతి కోసం వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం విద్యార్థుల హాజరు శాతం పెరుగుదల కోసం ఏఫ్ఆర్ఎస్ ప్రాంభించినట్లు తెలిపారు. తద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు మేసేజ్ రూపంలో తెలియజేయడం జరుగుతుందని అన్నారు. స్పోర్ట్‌కు కేటాయించిన నిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చేపట్టిన కళాశాల మరమ్మతుల గురించి వివరించారు. కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్లు అంకిత భావంతో పని చేస్తు విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీధికుక్కలతో బెంబేలు

వెంటాడుతున్న శునకాలు
- బయటికి వెళ్లాలంటే భయపడుతున్న జనాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బుట్టాయిగూడెంలో ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న శునకాలు

కన్నాయిగూడెం : బయటికి వెళ్లాలంటే వీధికుక్కలు బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీధుల్లో కనబడితే జనాలపై దాడులు చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ వెంటాడుతున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులకు గుండెల్లో వణుకు పుడుతుంది. ప్రజలు ఇంట్లోంచి కిరాణా షాపులకు, ఇతర పనులకు, కూలీకి వెళ్లాలన్న భయపడుతున్నారు. ప్రజలు ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా వెంటపడి కరుస్తున్నాయి. ఇక రాత్రిపూట రోడ్లపై పరిస్థితి మరీ దారుణం. ఏ వైపునుంచి వీధికుక్కలు వచ్చి దాడి చేస్తాయో తెలియని పరిస్థితి దాపురించింది. వీధిలైట్లు లేకపోవడంతో కుక్కలను గమనించే పరిస్థితి లేదు. లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. అధికారులు వాటిని కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఒకటికి నాలుగింతలు పెరిగి ఎక్కడ చూసిన గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి.

వీధికుక్కలతో ప్రమాదమే..

వీధికుక్కలు కరవడంతో ఎంతో మంది ఆస్పత్రి పాలవుతున్నారు. రూ.వేలలో అప్పు చేసి మరి వైద్యం చేసుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల పరిధిలో జనవరి నుంచి ఇప్పటివరకు 108 మందిపై కుక్కలు దాడి చేశాయి. వీరికి స్థానిక వైద్యశాలలో టీకాలు ఇచ్చినట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు.

చికెన్ షాపుల వద్ద వ్యర్థాలతో..

గ్రామాల్లోని కుక్కలు చికెన్ షాపుల వద్ద కోళ్ల వ్యర్థాలను తిని మాంసాహారానికి అలవాటు పడ్డారు. అవి దొరకని సమయంలో దారివెంట వెళ్లే ప్రజలపై దాడి చేసి కరుస్తున్నాయి. చికెన్ షాపుల నిర్వాహకులు వ్యర్థాలను బయట పడేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతీ రోజు ఎక్కడో ఓ చోట కుక్కలు జనాలపై దాడి చేస్తు కరుస్తున్నాయి. వీధి కుక్కలను కట్టడి చేయడంలో కొన్నేళ్లుగా సంబంధిత శాఖ అధికారులు పూర్తిగా పట్టించుకోవడం లేదు. దీంతో వాటి వృద్ధి విపరీతంగా పెరుగుతోంది.

రోడ్డెక్కాలంటే భయంగా ఉంది



అత్యవసర పనిపై బయటికి వెళ్లాలంటే కుక్కలు వెంటపడి కరుస్తున్నాయి. ఇక రాత్రిపూట వెళ్లాలంటే భయం వేస్తుంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జనగం నర్సింహారావు, బుట్టాయిగూడెం

చర్యలు తీసుకోవాలి



వీధి కుక్కలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎక్కడా చూసిన కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతు దాడులు చేస్తున్నాయి. చిన్న పిల్లలను వెంబడించి కరుస్తున్నాయి.

– దుర్గం రాజేష్, చింతగూడెం

శాంతిభద్రతల రక్షణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సూరి

మంగపేట : సమాజంలో శాంతిభద్రతల సంరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తమవంతు బాధ్యతగా పోలీసులకు సహకరించాలాని ఎస్సై సూరి కోరారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పెరుగుతున్న చట్టవిరుద్ధ కార్యక్రమాలు, అసాంఘిక శక్తులతో పాటు నిత్యం కనిపించే తప్పుడు విధానాలను మీడియా బాధ్యతగా వెలుగులోకి తెస్తేనే వాటిని నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. తప్పుచేస్తున్న వారు ఎవరైనా ఏ స్థాయి అధికారి అయినా ప్రజల్లో ప్రశ్నించే తత్వం వచ్చినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. దోపిడీ, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి విక్రయాలు, జూదం మీడియా, స్థానిక ప్రజల దృష్టికి వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మీడియా సమాజానికి నాలుగో స్తంభం వంటిదని ప్రతి సమాజ హితంకోసం నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తే మీడియాకు సమాజంలో విలువ పెరుగుతుందన్నారు. సమావేశంలో ట్రెయినీ ఎస్సై సురేష్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ములుగు : ములుగు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. బతుకమ్మ, దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని వేతనాలు అందించి కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. నాయకులు రవీందర్, మాట్ల జయాకర్, రఘు, భాస్కర్, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు

- ఆర్థిక స్థోమత లేక ఫీజు చెల్లించలేని స్థితి
- దాతల సాయం కోసం వేడుకోలు



మండపు లక్ష్మీరాజు

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం సమీపంలోని రెడ్డిగూడెం కాలనీకి చెందిన మండపు మల్లేశ్–సారక్క దంపతుల కుమారుడు లక్ష్మీరాజు నీట్ పరీక్షలో 420 మార్కులు సాధించి మంచిర్యాల జిల్లా రామగుండంలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి సీటు పొందాడు. ట్యూషన్, హాస్టల్ ఫీజు, మెస్ బిల్లు మొత్తం రూ.2లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ లక్ష్మీరాజును చదివించారు. ఈనెల 23వ తేదీ వరకు ప్రవేశం పొందాల్సి ఉంది. డబ్బులు చెల్లించే ఆర్థిక పరిస్థితి లేదని దాతలు సాయం చేసి ఆదుకోవాలని విద్యార్థి లక్ష్మీరాజుతో పాటు తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. లక్ష్మీరాజు 9392615824 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు. కాగా మేడారం ప్రాంతం నుంచి లక్ష్మీరాజు చిన్న వయస్సులో ఎంబీబీఎస్ సీటు సాధించడంపట్ల మేడారం, రెడ్డిగూడెం ప్రజలు అభినందిస్తున్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వాజేడు : వాజేడుకు చెందిన విద్యార్థిని తల్లడి నవ్య గ్నాపిక ఎంబీబీఎస్ సీటు సాధించించింది. దీంతో శనివారం మండల పరిధిలోని పెద్ద గొళ్లగూడెం ఆశ్రమ పాఠశాల, హాస్టల్ సిబ్బంది ఆమెను శాలువాతో సన్మానించారు. నవ్య గ్నాపిక 6 నుంచి పదో తరగతి వరకు పెద్ద గొళ్లగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుకుంది. 2024–25 విద్యాసంవత్సరంలో నీట్ రాసి మొదటి విడతలోనే నోవా మెడికల్ కళాశాలలో సీటు పొందింది. నిరుపేద విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించడంతో బాలికల ఆశ్రమ పాఠశాలలో శాలువా కప్పి సన్మానించి, అభినందించారు. కేశవరావు, రోజారాణి, తిరుపతమ్మ, బుచ్చిబాబు, కృష్ణయ్య, రామారావు, భారతి, ఉమాదేవి, రాంబాబు ఉన్నారు.

పింఛన్ పెంచే వరకు పోరాటం



వెంకటాపురం(ఎం): గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు



ఏటూరునాగారం: గ్రామ పంచాయతీ ఎదుట..



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, దివ్యాంగులు

ఏటూరునాగారం : చేయూత పింఛన్లు పెంచే వరకు పోరాడుతామని వీహెచ్‌పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్, మేతరి వీహెచ్‌పీఎస్ మహిళా విభాగం సీనియర్ నాయకురాలు కన్నబోయిన సరస్వతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట ఎమ్మార్పీఎస్, దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలను ముట్టడించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. జాషువా, కన్నయ్య, నర్సింగరావు, నరేష్, నరేందర్, వీరదాసు, భారతిరెడ్డి, వెంకన్న, రాజక్క, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేయూత పింఛన్లు పెంచాలని నిరసన

వెంకటాపురం(ఎం) : చేయూత పింఛన్లు పెంచాలని మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం ముందు ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వెంటనే పింఛన్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యామ్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు చిగురు దేవేందర్, నాయకులు అల్లెపు రవి, రెడ్డి ధనుంజయ, చంటి సదానందం, రెడ్డి శంకర్, సుజాత, సరిత, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న మహేందర్

ములుగు రూరల్ : చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని లీగల్ ఎయిడ్ ఛీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ తెలిపారు. శనివారం మండలంలోని ఇంచర్ల గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నాసిరకం విత్తనాలు అయినట్లయితే వినియోగదారుల ఫోరంలో కేసు నమోదు చేసుకోవాలని వివరించారు. ఉచిత న్యాయం ఎలా పొందాలనే విషయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత



పాఠ్యపుస్తకాలు చూపుతున్న విద్యార్థులు

గోవిందరావుపేట : చల్వాయి ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు చేయూత నందిస్తున్నారు. 1999–2000 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పోలెపల్లి రమేశ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ యునైటెడ్ హైదరాబాద్ అనే ఎన్జీఓ ద్వారా పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారు.ఈ సందర్భంగా శనివారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను అందజేశారు. పూర్వ విద్యార్థులు సూరపనేని కుషాల్ కుమార్, పోలెపల్లి రమేశ్, మిట్టకంటి శ్రీనివాస్, దామల్ల సాంబయ్య, కవితను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. హెచ్‌ఎం సమ్మయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్యాంసుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు వాసుదేవ రెడ్డి, మాధవిలత, సంజీవరాణి, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



వాజేడు: మహిళను పరీక్షిస్తున్న అరవింద

వాజేడు : మండల పరిధిలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్లు అరవింద, యోషిత, రాహిల్, సిబ్బంది వేణుగోపాల కృష్ణ, సంగీత, అనూష, రమాదేవి తదితరులు ఉన్నారు.

స్వస్త్ నారీ.. స్వశక్త్ వైద్యశిబిరం

మంగపేట : మండలంలోని మంగపేట, చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్త్ నారీ..స్వ శక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగపేట వైద్యాధికారి స్వప్నిత ఆధ్వర్యంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి ఛాతి వైద్య నిపుణుడు డాక్టర్ సుధీర్‌రెడ్డి, పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 300 మందికి పరీక్షలు నిర్వహించారు. దమ్ము, శ్వాస, అస్తమా తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స చేసి మందులు అందజేశారు. వ్యాధిగ్రస్తులు రోజువారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్‌కుమార్, తరుణ్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

చుంచుపల్లిలో చిన్నారులకు..

చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య నిపుణుడు వంశీకృష్ణ 320 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రతలను సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారం అందించడంపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మంగపేట: పరీక్షలు చేస్తున్న వైద్యుడు సుధీర్‌రెడ్డి



మంగపేట: చుంచుపల్లిలో..



ఏటూరునాగారం: బతుకమ్మఆడుతున్న విద్యార్థులు



వెంకటాపురం(ఎం)లో..



ఏటూరునాగారంలో..

ముందస్తు బతుకమ్మ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఉపాధ్యాయినులు, విద్యార్థినులు వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి సాంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. విద్యార్థులు నృత్యాలు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణమంతా బతుకమ్మలతో సందడిగా నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



వెంకటాపురం(కె): విజన్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వెంకటాపురం(ఎం): ఆరు అడుగుల బతుకమ్మతో..



ములుగు రూరల్: బండారుపల్లి మోడల్ స్కూల్‌లో..



కన్నాయిగూడెం: బతుకమ్మ సంబురాలు..



ఎస్ఎస్‌తాడ్వాయి: బతుకమ్మలతో విద్యార్థినులు



ఏటూరునాగారం: డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

మంగపేట : మండలంలోని గ్రామ పంచాయతీలకు దసరా పండుగ సందర్భంగా పంచాయతీల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా చొరవ చూపాలని పంచాయతీ కార్యదర్శులు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు అందకపోవడంతో పంచాయతీల నిర్వాహణ భారంగా మారిందన్నారు. గ్రామ పంచాయతీల నిర్వాహణకు నిధులు సమకూరేలా చొరవ చూపాలని వినతిపత్రంలో కోరారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొ